

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 284 | పేజీలు : 8 | వెల : రూ.2/- | శనివారం 07 నవంబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

ఉదయం 8 గంటలకు ప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో కౌంటింగ్


9,062 బల్లల ఏర్పాటు.. 30 వేల మందికిపైగా సిబ్బంది విధులు

70.72 శాతం పోలింగ్ నమోదు.. మూడు అంచెల భద్రత


2లో

తుపాన్ బాధిత రైతులకు అండగా ఉంటాం!

● బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ● జిల్లెలమూడి వంతెన, దెబ్బతిన్న డ్రెయిన్ల పరిశీలన.. రేటూరులో రైతులతో ముఖాముఖి



బాపట్ల,మన జనప్రగతి నవంబర్ 06: మురసు తుపాన్‌తో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. శుక్రవారం బాపట్ల, గుంటూరు జిల్లాల్లో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించి, అనంతరం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. **దెబ్బతిన్న డ్రెయిన్ల పరిశీలన** బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి వరద ప్రవాహ ఉధృతిని, తుపాన్ కారణంగా దెబ్బతిన్న డ్రెయిన్లను పరిశీలించారు. మిగతా2లో...

ఓటర్లకు మరో అవకాశం!

తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో

గల్లంతైన పేర్లకు మళ్లీ చోటు

అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా

చర్యలు: కేంద్ర ఎన్నికల సంఘం



2లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

ఈ నెల 13న ఏర్పడే అవకాశం.. 15 నాటికి వాయుగుండంగా బలపడుతుందా?


తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలపై ఉత్కంఠ


2లో

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

తక్షణ సాయంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి

మురసు తుపాన్‌తో రూ.1,919.59 కోట్ల నష్టం అంచనా


2లో

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..


- సుప్రీంకోర్టు కీలక సూచనలు


2లో

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

బీఎస్ఈ, నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం, రేస్‌కోర్స్ కూడా లక్ష్యంగా హెచ్చరికలు

అప్రమత్తమైన ముంబై పోలీసులు.. అనుమానితుడి కోసం దర్యాప్తు



2లో

నవంబరు 11న విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన!

పార్టీ ఆవిర్భావానికి పూర్తయిన ఏర్పాట్లు

అన్ని వర్గాల నేతలకు ఆహ్వానం.. యువతకు పెద్దపీట వేస్తామని వెల్లడి

రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని ధీమా



విజయవాడ,మన జనప్రగతి నవంబర్ 06: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ నెల 11న కొత్త పార్టీని ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకులు తమ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ నాయకురాలు సుమతిరెడ్డి, దళిత సంఘాల నాయకుడు బోణి గణేష్ తమ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. మిగతా2లో...



ఆసుపత్రిలో గోపికను పరామర్శించిన మంత్రి సవిత

- బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా.. కుటుంబ సభ్యులకు భరోసా

బెంగళూరు,మన జనప్రగతి నవంబర్ 06: అనంతపురం జిల్లా రాప్తాడు ఘటనలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగతా2లో...

గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తాం!

జ్వరాలపై ఆందోళన వద్దు.. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది

71 మందికి జ్వరాలు.. 30 మంది కోలుకున్నారు

516 మందికి పరీక్షలు.. ఒక్కరికే మలేరియా పాజిటివ్: మంత్రి సత్యకుమార్



పార్వతీపురం మన్యం,మన జనప్రగతి నవంబర్ 06: పార్వతీపురం మన్యం జిల్లా శివన్నపేట గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు జ్వరాలు రావడంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. శుక్రవారం హెల్త్ డైరెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. గురుకులంలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. మొత్తం 71 మంది విద్యార్థినులకు జ్వరాలు రాగా, వారిలో ఇప్పటికే 30 మంది పూర్తిగా కోలుకున్నారని వెల్లడించారు. గురుకులంలో 516 మంది విద్యార్థినులకు ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా ఒక్కరికే మలేరియా పాజిటివ్ వచ్చిందని, మిగిలిన వారికి నెగెటివ్‌గా మిగతా2లో...

ఓటర్లకు మరో అవకాశం!

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 06: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. గైర్హాజరు, వలస, మరణం, నకిలీ ఓటర్లుగా గుర్తించి జాబితా నుంచి తొలగించిన వారికి తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతోపాటు నకిలీ ఓటర్ల నమోదు జరగకుండా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.గణన పత్రాలు అందినప్పటికీ తిరిగి సమర్పించకపోవడంతో ముసాయిదా జాబితాలో పేరు చేరని వారు మళ్లీ గణన పత్రాలను సమర్పించవచ్చు. గతంలో ఉన్న నివాసంలోనే ఉంటున్నవారు ఆలస్యానికి కారణాన్ని వివరిస్తూ ప్రకటనతో పాటు గణన పత్రం అందించాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో అనుబంధం-సి ప్రకటన, చిరునామా ధ్రువీకరణ పత్రంతో గణన పత్రాన్ని సమర్పించాలి.ఇప్పటికే కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ గణన పత్రం, ప్రకటన ఇవ్వాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. సంబంధిత ఓటర్లను గుర్తించి సంప్రదించేందుకు బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇంటింటికీ వెళ్లడంతోపాటు పొరుగువారు, కుటుంబ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా వివరాలు సేకరించాలని ఆదేశించింది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

విశాఖపట్నం, మన జనప్రగతి నవంబర్ 06:
బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. 11న ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నవంబరు 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసింది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి 15వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది.అయితే అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా? తమిళనాడు తీరం వైపు పయనిస్తుందా? అన్న అంశాలపై ప్రస్తుతం స్పష్టత లేదని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని వాతావరణ నమూనాలు 15వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశాన్ని సూచిస్తున్నప్పటికీ, దాని తీవ్రత, దిశపై మరికొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధికారులు ఈ వ్యవస్థ కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 06: ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. వాహనాల నుంచి వెలువడే పొగ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొంది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 400కు చేరువ కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీతోపాటు ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్, గ్రేటర్ నోయిడా నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ప్రజా రవాణాను బలోపేతం చేయాలని సూచించింది.పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, వాటి కొనుగోలు ధరను ముందుగానే ప్రకటించాలని కేంద్రానికి తెలిపింది. గ్రామ పంచాయతీల ద్వారా సేకరణ, నిల్వ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం, నిర్మాణ వ్యర్థాలు, రోడ్ల దుమ్ము, పంట వ్యర్థాల దహనంపై చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ఢిల్లీ కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉందని వెల్లడించారు.పాఠశాలల మూసివేత, ఆన్‌లైన్ తరగతుల నిర్వహణపై నిపుణుల అభిప్రాయాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. శుక్రవారం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 391గా నమోదైంది. రోహిణిలో అత్యధికంగా 475గా నమోదుకాగా, ఐఐటీ ఢిల్లీ ప్రాంతంలో 472గా నమోదైంది.

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

ముంబై,మన జనప్రగతి నవంబర్ 06: బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపులతో కూడిన ఈ-మెయిల్ రావడంతో ముంబైలో భద్రతా ఆందోళన నెలకొంది. శుక్రవారం వచ్చిన ఈ సందేశంలో బాంబే హైకోర్టుతోపాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), వర్లీ రేస్‌కోర్స్, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసమైన 'జల్సా'ను పేల్చివేస్తామని హెచ్చరించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ-మెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు, బాంబు గుర్తింపు, నిర్వీర్య బృందాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపులు కేవలం భయపెట్టేందుకే చేసినవా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.ఈ-మెయిల్ పంపిన వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు సైబర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సందేశం పంపిన వారి ఐపీ చిరునామాను గుర్తించే పనిలో ఉన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని పలు న్యాయస్థానాలకు కూడా ఇలాంటి బెదిరింపు సందేశాలు రావడంతో తాజా ఘటనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

నవంబరు 11న విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాల్లో రెండు కుటుంబాల ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.కొత్త పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి కొత్త నాయకత్వం అవసరమని, యువత రాజకీయాల్లోకి రావాలని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా చేరికలు ఉంటాయని తెలిపారు. తమ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంకుశ పాలనకు తావులేని విధంగా, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా పార్టీ పనిచేస్తుందని వివరించారు.వైసీపీ నుంచి బయటకు రావడంపై స్పందిస్తూ.. జగన్‌ను వదిలి వెళ్లిపోతానని కలలో కూడా అనుకోలేదని విజయసాయిరెడ్డి అన్నారు.

పార్టీలో తనకు ఎదురైన అవమానాలు, పరిణామాల కారణంగానే బయటకు రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కొందరి చెప్పుడు మాటలు విని జగన్ తనను బాధపెట్టారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి తనను ఎప్పుడూ అవమానించలేదని గుర్తుచేశారు.ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు ఉమ్మడి జిల్లాల్లో రిగ్గింగ్ జరిగిందని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు అవకాశాలు, అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని విజయసాయిరెడ్డి వెల్లడించారు.

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

విజయవాడ,మన జనప్రగతి నవంబర్ 06: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటలకు 365 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 9,062 కౌంటింగ్ బల్లలను సిద్ధం చేయగా, 11,002 మంది పర్యవేక్షకులు, 28,692 మంది కౌంటింగ్ సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారు. **తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు** కౌంటింగ్ ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ పెట్టెలను తెరిచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎంపీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వేర్వేరుగా విభజి స్తారు. వాటిని 25 చొప్పున కట్టలుగా తయారు చేసి, విడివిడిగా కలిపిన తర్వాత లెక్కిస్తారు. మొత్తం బల్లల్లో సగం జడ్పీటీసీ, మిగిలిన సగం ఎంపీటీసీ ఓట్ల లెక్కిం పునకు కేటాయించారు. ఒక్కో బల్లపై ప్రతి విడతలో వెయ్యి బ్యాలెట్లను లెక్కించనున్నారు. **70.72 శాతం పోలింగ్ నమోదు** నవంబరు 5న రాష్ట్రవ్యాప్తంగా 577 జడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 70.72 శాతం ఓటింగ్ నమోదైంది. 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. **రీపోలింగ్ కూడా పూర్తి** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురం, ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో వాయిదా పడిన పోలింగ్‌ను నవంబరు 6న నిర్వహించారు. అలాగే అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో వివిధ కారణాలతో తిరిగి పోలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నేడు ఓట్ల లెక్కింపునకు అధికారులు సిద్ధమయ్యారు. **కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లు, పోలీసుల శరీరాలకు అమర్చిన కెమెరాలతో నిఘా కొనసాగించనున్నారు. బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు భారీ భద్రత మధ్య తరలించారు. **మధ్యాహ్నం నుంచి ఫలితాలపై ఉత్కంఠ** బ్యాలెట్ పత్రాలతో ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఫలితాలు విడతలవారీగా వెలువడనున్నాయి. మధ్యాహ్నం నుంచి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు ముందుగా, జడ్పీటీసీ ఫలితాలు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అంచనా. రాత్రి వరకు కొన్ని స్థానాల ఫలితాలు వెలువడే అవకాశముంది. వేలాది మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని తేల్చ నున్న ఈ కౌంటింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

తుపాన్ బాధిత రైతులకు అండగా ఉంటాం!

(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్లకు గండ్లు పడటంతో నీటి ప్రవాహానికి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని సూచించారు. నల్లమడ వాగు గేట్లు దెబ్బతినడంపై రైతులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా, వాటికి మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట కొత్త గేట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.**రేటూరులో రైతులతో ముఖాముఖి** అనంతరం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను మండలం రేటూరు గ్రామానికి వెళ్లారు. అక్కడ నీట మునిగిన వరి పొలాలను పరిశీలించేందుకు రైతులతో కలిసి పొలం గట్లపై నడిచారు. పంట పెట్టుబడులు, దిగుబడి అంచనాలు, నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్ దెబ్బతీయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.**పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి** ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, పెట్టుబడి రాయితీ రైతులకు కొంత ఊరటనిస్తాయని చంద్రబాబు తెలిపారు. ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. బీమా ప్రయోజనాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. సాగు సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.**వరుస తుపానులతో కోస్తా రైతులకు నష్టం** అరనబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తొలుత సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు, పట్టిసీమ నీటితో పంటలు సాగు చేసి మంచి దిగుబడులు వస్తాయని ఆశించిన సమయంలో వరుస తుపాన్ల బారిన పడ్డారని పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వరుసగా రెండు తుపానులు రావడం చరిత్రలోనే తొలిసారి అని అన్నారు.**ప్రతి బాధితుడికీ సహాయం** తుపాన్ల వల్ల జరిగిన పంట, ఆస్తి నష్టాన్ని ప్రభుత్వం సమగ్రంగా అంచనా వేస్తోందని చంద్రబాబు తెలిపారు. చివరి బాధితుడి వరకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అరనబ్ తుపాన్ సమయంలో దెబ్బతిన్న 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాన్‌తో మరో 10 వేల స్తంభాలు దెబ్బతిన్నాయని వివరించారు. మత్స్య చెరువులకు విద్యుత్ సరఫరాను కూడా ప్రాధాన్యంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. తుపాన్ సహాయక, పునరుద్ధరణ చర్యల్లో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహకారం కోరినట్లు వెల్లడించారు.కోస్తా ప్రాంతాలు వరుస తుపాన్లతో ఇబ్బందులు పడుతుంటే, ఎల్‌నినో ప్రభావంతో రాయలసీమలో కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని సీఎం పేర్కొన్నారు. వరద నీరు సముద్రంలోకి వృథాగా పోకుండా వినియోగించుకునేలా, రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 06: వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. మురసు తుపాన్ కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.1,919.59 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. అక్టోబరు 27న వచ్చిన అర్నబ్ తుపాన్ నష్టం నుంచి రాష్ట్రం కోలుకోకముందే మరో తుపాన్ విరుచుకుపడటంతో రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.**1.86 లక్షల మంది రైతులకు నష్టం**మురసు తుపాన్ ప్రభావంతో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు నష్టపోయారని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులకు నష్టం జరిగింది. ఈ రంగంలో రూ.337.10 కోట్ల నష్టం అంచనా వేశారు.**అనేక రంగాలపై తుపాన్ ప్రభావం**పశు సంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, సాగునీరు, విద్యుత్, పంచాయతీరాజ్, విద్య, వైద్య రంగాల్లోనూ భారీ నష్టం జరిగినట్లు కేంద్రానికి వివరించారు. వరద నీరు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి నష్టం అంచనా వేస్తామని, 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామని తెలిపారు. రైతులు, మత్స్యకారులు, ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు.**ప్రజలకు అండగా ప్రభుత్వం** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. విద్యుత్ సరఫరా, రహదారులు, ఇతర అత్యవసర సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం నుంచి తక్షణ ఆర్థిక సాయం అందితే బాధితులకు ఉపశమనం కలగడంతో పాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు వీలవుతుందని లేఖలో వివరించారు.

ఆసుపత్రిలో గోపికను పరామర్శించిన మంత్రి సవిత

(మొదటి పేజీ తరువాయి)

బాలిక గోపికను ఏపీ మంత్రి సవిత పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి బాలికకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గోపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోపికపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. తీవ్ర గాయాలతో ఆమెను తొలుత అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లతో బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. బాలిక త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారణ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 38 మందిని గురుకులంలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నామని, మరో ముగ్గురికి కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందిస్తున్నామని వివరించారు. విద్యార్థినుల కోసం జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల వైద్య నిపుణులతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.వైద్య నిపుణుల ప్రాథమిక అంచనా ప్రకారం విద్యార్థినులకు తుపాన్ల అనంతరం వచ్చే వైరల్ జ్వరాలు సోకినట్లు భావిస్తున్నారని తెలిపారు. 44 మంది విద్యార్థినులకు నిర్వహించిన రక్తపరీక్షల్లో ఫలితాలు సాధారణంగా వచ్చాయని, మరిన్ని పరీక్షల కోసం రక్త నమూనాలను ప్రయోగశాలకు పంపించామని పేర్కొన్నారు. గురుకులంలోని మూడు తాగునీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపినట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, జ్వర లక్షణాలు ఉన్నవారికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

బీసీ విద్యార్థులకు స్టైపెండ్ పెంపు!

- సివిల్స్ అభ్యర్థులకు రూ.7 వేలు.. గ్రూప్స్ విద్యార్థులకు రూ.1,500



హైదరాబాద్,మన జనప్రగతి నవంబర్ 06: బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థుల స్టైపెండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. సివిల్స్ అభ్యర్థులకు నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేలకు, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే అభ్యర్థులకు రూ.1,000 నుంచి రూ.1,500కు పెంచినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సివిల్స్ అభ్యర్థుల పుస్తకాల నిధిని రూ.10 వేలకు పెంచారు. ఈ నిర్ణయం నవంబరు నుంచే అమల్లోకి రానుంది.

నేటి కాలంలో చట్టాల విలువ తెలిసి ఉండాలి

• మండల న్యాయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు





ఎమ్మిగనూరు మన జనప్రగతి నవంబర్ 06:-నేటి కాలంలో చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహనలు కలిగి వాటి విలువలు తెలిసి ఉండాలని ఎమ్మిగనూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రసీదుల్లా అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వైష్ణవి జూనియర్ కాలేజ్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, డిపి యాక్ట్, మహిళల రక్షణ చట్టాలు తదితర విషయాలపై అవగాహనలు కల్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయం అందిస్తామని బాధితులుంటే మండల న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ షరీఫ్ ఉన్నిసా బేగం, న్యాయవాదులు మురళీకృష్ణ, లింగమూర్తి, జగన్మోహన్ మహేశ్వరి, శ్రావణి,కాలేజ్ కరస్పాండెంట్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- తల్లి,బిడ్డ క్షేమానికి ఆసుపత్రి ప్రసవమే సురక్షితం: వైద్యాధికారి బి.వినూత



బొమ్మనహల్ మన జనప్రగతి నవంబర్ 6 :-మండల పరిధిలో ఉద్దేహాల్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పరిధిలో నిర్వహించిన సంచార వైద్యశిబిరంలో వైద్యాధికారి బి.వినూత అధ్వర్యంలో గర్భిణులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నవారు ఆసుపత్రిలో ఉచితంగా ఐరన్ ఇంజక్షన్లు తీసుకోవాలని సూచించారు, అలాగే తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే ఆసుపత్రిలో ప్రసవం చేయించుకోవడమే సురక్షితమని అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బి.వినూత, పీహెచ్ఎన్ చిలకమ్మ, ఎంఎల్హెచ్పీ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు జానకి, శారద,గోవర్ధన్,ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి,హరిత,పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



ఓబులవారిపల్లి మన జనప్రగతి నవంబర్ 06:-తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కువారిపల్లి పంచాయతీలో గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు వేసిన దృశ్యాలను మీడియాకు అందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, ముక్కా సాయి వికాస్ రెడ్డి, ఆయన సతీమణి ముక్కా శిరీష, విశాల్ రెడ్డి, షగమాల మల్లికార్జున రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ప్యారా లీగల్ వాలంటీర్ల ఎంపిక





కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 06:-రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మరియు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూల్ లో ప్యారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయుటకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను శుక్రవారం ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేశారు. ఇలా ఎంపికైన ప్యారా లీగల్ వాలంటీర్ లకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు చట్టపరమైన శిక్షణను ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న ప్యారా లీగల్ వాలంటీర్స్ వారి వారి గ్రామాలలో ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగించి ప్రజల యొక్క చట్టపరమైన సమస్యలను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకువచ్చి వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తారని తెలిపారు. ఈ ప్యారా లీగల్ వాలంటీర్స్ ప్రజలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు వారధిగా పనిచేస్తారని అన్నారు.

స్నేహిత అమృత హస్తం సేవాసమితి భవన నిర్మాణానికి రూ.68 వేల పెయింటింగ్ సామాగ్రి వితరణ

దాతల సహకారం స్ఫూర్తిదాయకం: సేవాసమితి అధ్యక్షులు రాజు

సామాగ్రిని అందజేసిన మోదుపల్లి వెంకటప్రసాద్



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 06: సామాజిక సేవే పరమావధిగా పనిచేస్తున్న 'స్నేహిత అమృత హస్తం సేవాసమితి' నూతన భవన నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సేవాసమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు.లింగాల మండలం పార్నపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త,మణికంఠ ఫర్టిలైజర్స్ అధినేత మోదుపల్లి వెంకటప్రసాద్ సేవాభావంతో ముందుకు వచ్చి సుమారు రూ.68 వేల విలువైన పెయింటింగ్ సామాగ్రిని వితరణగా అందజేశారు.పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీ మార్గంలో (100 అడుగుల రోడ్డు) నిర్మిస్తున్న సేవాసమితి నూతన భవన గ్రౌండ్ ఫ్లోర్ పెయింటింగ్ పనుల కోసం ఈ సామాగ్రిని శుక్రవారం స్వయంగా భవన ప్రాంగణంలో అధ్యక్షులు రాజుకు అందజేశారు.ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ 2010లో ప్రారంభమైన తమ సంస్థ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యాబోధన, నేత్రదాన అవగాహన,నేత్ర సేకరణ,యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతన భవనం పూర్తయితే ఈ సేవలన్నీ మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రజోపయోగ భవన నిర్మాణానికి తోడ్పాటు అందించిన మోదుపల్లి వెంకటప్రసాద్‌కు సేవాసమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,ఇటువంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సేవాసమితి ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం సభ్యులు,డాక్టర్ ఓబుల్ రెడ్డి,శివరాం రెడ్డి, సభ్యులు సురేష్,శ్రీ రాజా కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజా,బండారు రాజు, మాల్యాద్రి పాల్గొన్నారు.

మహిళల హక్కులు, రక్షణ పై అవగాహన సదస్సు.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 06:-సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కర్నూలు,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మరియు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ లు జిల్లా న్యాయ సేవా సంస్థ నందు మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు లా కాలేజీ మరియు ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో మహిళల హక్కులు రక్షణ మరియు లింగ సమానత్వం మరియు మహిళలకు సంబంధించిన ప్రాథమిక హక్కులు పై వన్ స్టాఫ్ సెంటర్ సిబ్బంది కి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారికి, మహిళా పోలీసులకు, పోలీసులకు, లా కాలేజీ స్టూడెంట్ లకు,ఎన్జీవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి గారు మాట్లాడుతూ మహిళలకు చట్టపరంగా కీలకమైన రక్షణలు, హక్కులు ఉన్నాయని తెలిపారు. గృహహింస నిరోధక చట్టం, 2005 ప్రకారం కుటుంబ సభ్యులు లేదా జీవిత భాగస్వామి నుండి శారీరక మానసిక ఆర్థిక వేధింపుల నుండి మహిళలకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. వరకట్న నిషేధ చట్టం 1961 ద్వారా కట్నం తీసుకోవడం లేదా ఇవ్వడం చట్టపకారం నేరమని తెలిపారు. వరకట్నం వేధింపులకు కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ పనిచేయు చోట మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం, 2013 ప్రకారం కార్యాలయంలలో మహిళలకు రక్షణ కల్పిస్తూ లైంగిక వేధింపుల నివారణకు మరియు పరిష్కారానికి ఈ చట్టం తోడ్పడుతుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ అనేది ప్రజా వినియోగ సేవలు కోసం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. దీనిలో 10 సేవలకు సంబంధించి వినియోగదారులకు మరియు ఆయా సంస్థలకు గల వివాదాలను కోటి రూపాయల పరిధి వరకు ఎటువంటి కోర్ట్ ఫీజు, ఖర్చు లేకుండా సత్వరంగా పరిష్కరించు కోవచ్చని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జి డైరెక్టర్ నారాయణమ్మ గారు మాట్లాడుతూ ఎక్కడైనా గృహహింస జరిగినప్పుడు మహిళలు వారి మండలంలో గల సిడిపిఓ లను సంప్రదిస్తే వారు వారికి రక్షణ మరియు చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. మహిళా హక్కుల కోసం తమ డిపార్ట్మెంట్ లో గల లీగల్ కౌన్సిల్స్ మరియు వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది అన్ని విధాలా కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళల రక్షణ కొరకై పనిచేయు ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం 2013 పై ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ లను జడ్జి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్,మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జి ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ ,లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, మహిళా పోలీసులు, లీగల్ టీం సభ్యులు, పోలీసులు, ఎన్జీవోలు, లా కాలేజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 06:- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై స్పెషల్ ఆఫీసర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ తెరిచే సమయంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలోనే ప్రక్రియ చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ తెరవడం, సీల్స్ తొలగించడం, బ్యాలెట్ బాక్సులను బయటకు తీసే ప్రక్రియను పూర్తిగా చిత్రీకరించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించి, మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ఉదయం 10.30 గంటలలోపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే, చెల్లని ఓట్ల గుర్తింపుపై సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని, ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నమూనా బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.ప్రతి రౌండ్‌లో అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఖచ్చితంగా లెక్కించి, వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు. ఇందుకోసం కంప్యూటర్లు, ప్రింటర్లు, అంతర్జాల సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏదైనా బ్యాలెట్ పత్రంపై సందేహం తలెత్తితే రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు వ్యవహరించాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో సిబ్బంది, ఏజెంట్లకు తాగునీరు, అల్పాహారం, భోజనం, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కౌంటింగ్ హాల్‌లోకి సిబ్బంది సెల్‌ఫోన్లను అనుమతించకూడదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపులో ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే వాటిని నమోదు చేసి రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తూ లెక్కింపు కొనసాగించాలన్నారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కౌంటింగ్, రిసెప్షన్, పంపిణీ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా పరిషత్ ముఖ్యనిర్వహణ అధికారి సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నగరపాలక సంస్థ

- జేసీబీతో రోడ్డు తవ్వి ప్రధాన డ్రైనేజీలోకి వరద నీటి మళ్లింపు



కాకినాడ మన జనప్రగతి నవంబర్ 06:-భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాకినాడ నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలోని ఆర్ఎంసీ గ్రౌండ్ రోడ్డు గత మూడు రోజులుగా వరద నీటితో నిండిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు శుక్రవారం సాయంత్రం కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రోడ్డును తవ్వి నిలిచిపోయిన నీటిని ప్రధాన డ్రైనేజీలోకి మళ్లించారు.అలాగే జనచైతన్య నగర్‌లో ముంపునకు గురైన కుటుంబాలను గుర్తించి శనివారం ఉదయం ప్రత్యేక బృందాల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు భోజనం, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు.ప్రతాప్ నగర్ తదితర ప్రాంతాల్లోని ముంపు బాధితులను కూడా పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. నగరంలో డ్రైనేజీ కాలువల ఆక్రమణలు, మ్యాన్‌హోళ్లను శాశ్వతంగా మూసివేయడం వల్ల వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందన్నారు. ప్రజలు డ్రైనేజీలను ఆక్రమించకుండా, మ్యాన్‌హోళ్లను మూసివేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్ఈ పి. వెంకట్రావు, డీఈలు మాచిరాజు, లక్ష్మీనారాయణ, ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్, పారిశుధ్య పర్యవేక్షకుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శీతల గంగమ్మకు విశేష పూజలు



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 06:-మండలంలోని మాధవరం-1 పరిధిలోని పార్వతీపురం గ్రామంలో కడపచెన్నై జాతీయ రహదారి సమీపంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పూజారి రంగమ్మ మాట్లాడుతూ వేకువజామునే అమ్మవారి మూలవిరాట్‌కు జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెలుగుపల్లిలో డ్రైనేజీ సమస్య..దోమల బెడద



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 06:-సిద్ధవటం మండలం వెలుగుపల్లి గ్రామంలో డ్రైనేజీ కాలువలు మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుసు తుఫాన్ ప్రభావంతో వాతావరణం ముసురుగా ఉండటంతో పాటు కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ తదితర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత స్పందించకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదు రెవెన్యూ డివిజన్లలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ కౌంటింగ్ కేంద్రాలు



కడప, మన జనప్రగతి, నవంబర్ 06:- జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఐదు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బద్వేల్ డివిజన్‌కు సంబంధించి అంబేద్కర్ గురుకులం, జమ్మలమడుగు డివిజన్‌కు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కడప డివిజన్‌కు మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పులివెందుల డివిజన్‌కు రమణప్ప సత్రం, జెడ్పీ హైస్కూల్, రాజంపేట డివిజన్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బియ్యం ధరల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

- నిర్ణీత ధరలకే విక్రయించాలి: జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

మదనపల్లి, మన జనప్రగతి, నవంబర్ 6:బియ్యం ధరలను నియంత్రించి ప్రజలకు సరసమైన ధరలకు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ వ్యాపారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులు, వ్యాపారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.ఒకే రకం బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ల పేర్లతో అధిక ధరలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను నెల రోజులపాటు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ధరణి ఫైన్ రైస్ పథకం ద్వారా రైతు బజార్లలో కిలో కేఎన్ఎం బియ్యం రూ.50, బీపీటీ బియ్యం రూ.49కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విక్రయ కేంద్రాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు.


కేపీహెచ్‌బీ ప్రభుత్వ భూములను అమ్మొద్దు

- ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన భూములను విక్రయించడం దురదృష్టకరం
- ప్రభుత్వ భూముల అమ్మకాలను అడ్డుకుంటాం



కూకట్‌పల్లి మన జనప్రగతి నవంబర్ 06:-కేపీహెచ్‌బీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టడంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన భూములను విక్రయించడం సరికాదని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మహిళా పార్కులు, చిన్నారుల పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్ల విలువైన భూములను అమ్మకానికి పెట్టడం దురదృష్టకరమని విమర్శించారు.కేపీహెచ్‌బీ వంటి పెద్ద కాలనీలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో పాటు, ప్రజలకు అవసరమైన పెట్రోల్ బంకు కోసం కేటాయించాల్సిన స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టేందుకు టెండర్లు పిలవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను విక్రయిస్తే ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, విలేకరులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. హౌసింగ్ బోర్డు భూములను కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం భూముల అమ్మకాలకు ప్రయత్నిస్తే అడ్డుకుంటామని, టెండర్లలో ఎవరైనా పాల్గొన్నా వాటిని అడ్డుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల తరఫున పోరాడి ప్రభుత్వ భూములను కాపాడుకుంటామని తెలిపారు.

ఎస్సీబీవిడి పాఠశాలలో ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు



సిద్ధవటం మనజనప్రగతి నవంబర్ 06:-సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామపంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఎస్సీబీవిడీ సభ ఎలిమెంటరీ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ వేషధారణలతో అలరించారు. దీపావళి పండుగ విశిష్టత, పండుగను సాంప్రదాయ బద్ధంగా ఎలా జరుపుకోవాలి, దీపాల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా కాకుండా సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వేషధారణలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రధానో పాధ్యాయులు మేరువ మధుసూదన్‌తో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టూడెంట్ అసెంబ్లీ నియోజకవర్గ విజేతగా హిమశ్రీ

- అమరావతి మాక్ అసెంబ్లీ శిక్షణకు ఎంపిక



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 06:రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 'స్టూడెంట్ అసెంబ్లీ' పోటీల్లో పులివెందుల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.హిమశ్రీ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది.ఈ పోటీల్లో ఆమె మొత్తం 120 మార్కులు సాధించి విజేతగా నిలిచింది. గత ఏడాది నిర్వహించిన జాతీయ ఉపకార వేతనాల (ఎన్ఎమ్ఎమ్ఎస్) పరీక్షలో కూడా హిమశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం విశేషం.ఈ పోటీల్లో అహోబిలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.అఖిల్ ద్వితీయ స్థానంలో,అంకాలమ్మగూడూరు పాఠశాల విద్యార్థిని ఏ.యస్మిత తృతీయ స్థానంలో నిలిచినట్లు కార్యక్రమ నిర్వాహకులు రవిచంద్రారెడ్డి,సెల్వరాజ్ తెలిపారు.ఎంపికైన విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వీరిలో ప్రతిభ కనబరిచిన ఒక విద్యార్థి అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీలో పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.విద్యార్థుల ప్రతిభ పట్ల సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

దోమల నివారణకు పరిశుభ్రత పాటించాలి



సిద్ధవటం మన జనప్రగతినవంబర్ 06:-దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు సూచించారు. డ్రైడే డ్రై డే సందర్భంగా శుక్రవారం సిద్ధవటం మండలం వంతాటిపల్లిలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వారానికి ఒకసారి నీటి తొట్లలోని నీటిని తొలగించి కొత్త నీటిని నింపాలని సూచించారు. పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు తదితరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రాత్రివేళ దోమల కాటు నుంచి రక్షణ కోసం తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలని తెలిపారు. జలుబు, దగ్గు, తలనొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి వైద్యుల సూచనలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీల్లో ఆదిత్యకు ప్రథమ బహుమతి

- ఇండోనేషియాలో జరిగిన 'రోబోరోర్జ్2026'లో ప్రతిభ చాటిన విద్యార్థులు



కాకినాడ మన జనప్రగతి నవంబరు 06:-అంతర్జాతీయ స్థాయి రోబోటిక్స్ పోటీల్లో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇండోనేషియాలోని తాంగెరాంగ్ నగరంలో ఉన్న యూపీహెచ్ విశ్వవిద్యాలయంలో అక్టోబరు 29 నుంచి 31 వరకు నిర్వహించిన 'రోబోరోర్జ్2026' అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి దేశానికి, కళాశాలకు కీర్తి తీసుకొచ్చారు.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 100కు పైగా జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో భారత్ తరఫున కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 'ఆదిత్య సైబర్ ఇన్నోవేటర్స్' బృందం ప్రాతినిధ్యం వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థి ముత్యాల రవి దొడ్డి దత్త శ్రీకరి నేతృత్వంలోని బృందం వినూత్న ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఇమాజినరీ, పైలట్, అటానమస్ అనే మూడు ప్రధాన విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.ఈ విజయంపై ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై విద్యార్థులు రాణించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక వనరులు, నిపుణుల మార్గదర్శకత్వం అందించడంలో సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించి ఈ విజయానికి దోహదపడిన అధ్యాపక బృందాన్ని కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్ సుగుణారెడ్డి అభినందించారు.శుక్రవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు, డీన్ సిద్ధార్థరెడ్డి, ఏఎస్సీఎస్ ప్రిన్సిపాల్ డి బ్యూలా, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ, ఏఎస్ఎంఎస్ ప్రిన్సిపాల్ ఎండి షైద్దీన్ తదితరులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలి: డాక్టర్ జ్యోతి నీరజ,డాక్టర్ ఉపేంద్ర కుమార్



కడప మన జనప్రగతి నవంబర్ 06:- మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ మార్గ్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ జ్యోతి నీరజ, డాక్టర్ ఉపేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం కడప వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ప్రస్తుత జీవనశైలి, పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వ్యక్తిగత ఆందోళనల కారణంగా చాలామంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు.ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్, భయం, జ్ఞాపకశక్తి లోపం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమని, సమస్యలతో బాధపడుతున్న వారిని చిన్నచూపు చూడకుండా కుటుంబ సభ్యులు వారికి అండగా నిలవాలని కోరారు.సకాలంలో సరైన వైద్య చికిత్స పొందడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వారు తెలిపారు. ప్రత్యేకంగా కడప జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు

లక్ష్యసాధనకు నిరంతర సాధన అవసరం

● డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి



రాయచోటి మన జనప్రగతి నవంబర్ 06:-లక్ష్యసాధనకు నిరంతర సాధన అవసరమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌నరసింహారెడ్డి అన్నారు.జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో శుక్రవారం ప్రథమ సంవత్సరం ఛాత్రోపాధ్యాయులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా,ఉత్సాహంగా కొనసాగాయి. విద్యార్థుల మధ్య స్నేహభావం, పరస్పర సహకారం, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఏకపాత్రాభినయాలు,నృత్యాలు, నాటకాలతో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు,విద్యార్థులలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు,ప్రథమ సంవత్సరం,ద్వితీయ సంవత్సరం ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ అధికారుల ఆరోగ్య భరోసా పథకం పోస్టర్ ఆవిష్కరణ



కడప, మన జనప్రగతి, నవంబర్ 06:- న్యాయాధికారుల ఆరోగ్య భద్రత, మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమాన్ని లక్ష్యంగా అమలు చేస్తున్న జ్యుడీషియల్ ఆఫీసర్స్ హెల్త్ అస్యూరెన్స్ పథకంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయాధికారుల ఆరోగ్య పరిరక్షణ, వైద్య అవసరాలు, సంక్షేమానికి జోనూ పథకం దోహదపడుతుందని తెలిపారు. పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి యుగంధర్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

36వ వార్డు కౌన్సిలర్ దుర్గాభవానికి ఏపీఎంపీఏ ఘన సన్మానం



జగ్గయ్యపేట, మన జనప్రగతి నవంబర్ 06:- జగ్గయ్యపేట మున్సిపాలిటీ 36వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన కళ్యాణపు దుర్గాభవానిని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) జగ్గయ్యపేట కమిటీ ఘనంగా సత్కరించింది.ఏపీఎంపీఏ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు సతీమణి దుర్గాభవాని ఎన్నికైన సందర్భంగా సంఘం ప్రతినిధులు వారి నివాసానికి వెళ్లి దంపతులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ దుర్గాభవాని వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ జగ్గయ్యపేట అధ్యక్షుడు కాకరపర్తి రమేష్, ఎన్టీఆర్ జిల్లా నాయకులు మెటికల శ్రీనివాసరావు, మాల్యాద్రి వంశీ, ఇనపనుర్తి శ్రీనివాసరావు, రాము, గుడేటి దాసు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనలు కలిగి ఉండాలి

- అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ

పత్తికొండ మన జనప్రగతి డిసెంబర్ 06:-ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యంగా ముందుకెళ్తోందని, అందుకు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహనలు కలిగి ఉండాలని సూరజ్ నబి, శ్రీనివాసరెడ్డిలు అన్నారు.శుక్రవారం కర్నూలు జిల్లా పత్తికొండలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ నంబర్ 2 వసతి గృహంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు ఆర్థిక నేరాలు మహిళలపై దాడులు ఇలా అనేక అంశాలపై అవగాహనాలు కలిగి ఉండాలని విద్యార్థులు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రమేష్,నాగరాజు,లోక్ అదాల క్లర్క్ రాఘవేంద్ర,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థాయిలోనే వివాదాల పరిష్కారానికి

కమ్యూనిటీ మధ్యవర్తిత్వం

● చాపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ



చాపాడు, మన జనప్రగతి, నవంబర్ 06:- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తలెత్తే చిన్నచిన్న వివాదాలను కోర్టులకు వెళ్లకుండానే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు కమ్యూనిటీ మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ సూచనలతో శుక్రవారం చాపాడు ఎంపీడీవో కార్యాలయంలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, ఇతర సామాజిక సమస్యలను పరస్పర చర్చలు, అవగాహన, సయోధ్య ద్వారా స్థానికంగానే పరిష్కరించుకోవచ్చన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, సామాజిక ఐక్యత పెరుగుతాయని పేర్కొన్నారు. శాశ్వత లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్, ఎల్ఎస్‌యూసీ, ఎల్ఎస్‌యూఎం తదితర న్యాయ సేవల గురించి వివరించారు. న్యాయ సేవల హెల్ప్‌లైన్ నంబర్ 15100ను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం శిక్షణ పొందిన కమ్యూనిటీ మధ్యవర్తులు బి. రామకృష్ణారెడ్డి, ఎం. ఓబులారెడ్డి, జి. శేషయ్యలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, న్యాయ సేవా ప్రతినిధులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా మంత్రి కందుల దుర్గేష్

● ముంపు ప్రాంతాల్లో పర్యటన ● బాధితులకు స్వయంగా భోజనాల వడ్డింపు



నిడదవోలు, మన జనప్రగతి, నవంబర్ 06:- 'మురసు' తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసి ముంపునకు గురైన నిడదవోలు నియోజకవర్గంలోని ప్రాంతాల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విస్తృతంగా పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు.నిడదవోలు పట్టణంలోని ఇందిరానగర్, రాయిపేట, తీరుగూడెం తదితర ప్రాంతాలతో పాటు ఆంజనేయపురం, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం, మాధవరం, సింగవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. రహదారులు నీటమునగడంతో మోకాల్లోతు నీటిలో నడుస్తూ, బైక్‌లు, ట్రాక్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ బోట్ల ద్వారా ముంపు ప్రాంతాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు.మంత్రి చొరవతో 30 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, ఫైర్ సిబ్బందిని రంగంలోకి దించి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం అందించడంతో పాటు మంత్రి స్వయంగా భోజనాలు వడ్డించారు. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. సురక్షిత తాగునీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.ఎర్రకాలువ గేట్లను మూసివేసి వరద ప్రవాహాన్ని నియంత్రిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నీటమునిగిన పంటలకు సంబంధించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పశువుల సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.ఎర్రకాలువ ఉప్పొంగుతున్న నేపథ్యంలో ప్రజలు మరో రెండు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని మంత్రి కోరారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన మంత్రికి వరద బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

యువశక్తి ఆలోచన సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 06:-దేశంలోని యువశక్తి ఆలోచన విధానాన్ని సమాజం అభివృద్ధి చెందేందుకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ మరియు మై భారత్ కేంద్ర కడప ఆధ్వర్యంలో సీబీఐటీ కళాశాల ప్రాంగణము నందు యూత్ పార్లమెంట్ 2027 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూసమాజం కోసం యువత ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి అని సూచించారు. భారతదేశంలోని యువత మేధాశక్తిని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. గెలుపు ఓటములు ఏదైనా ముందడుగు వేయాలని.జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన యువత వన్ నేషన్ వన్ ఎలక్షన్ పైన వారి యొక్క ఆలోచన విధానాన్ని వివరిస్తూ వారి ఆలోచన విధానాన్ని స్పష్టంగా తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశంపై చక్కగా వివరించారు. మై భారత్ కేంద్ర యూత్ ఆఫీసర్ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలలో యువత తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమం నందు ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి త్వరలోనే రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారని వెల్లడించారు. మారుమూల పల్లె నుంచి ఢిల్లీ దాకా వెళ్లి పార్లమెంటులో ప్రసంగించే అరుదైన అవకాశం యువతకు దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను ప్రధానం చేసి, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ శృతి, న్యాయ నిర్ణేతలుగా కే. శ్రీనివాస్ కుమార్, మల్లెల లక్ష్మీ తనూజ, సంజీవ రాయుడు, శూలం లక్ష్మీదేవి, మై భారత్ కేంద్ర సిబ్బంది వెంకటేశు, బాలరాజు, వెంకటసుబ్బయ్య, వీరయ్య, రవి , లక్ష్మీనారాయణ,మల్లిఖార్జున లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

● మూడు రెవెన్యూ డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు



మదనపల్లి, మన జనప్రగతి, నవంబర్ 06:- అన్నమయ్య జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు.మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటి డివిజన్‌కు మాసాపేటలోని పాత ఎస్పీ బంగ్లా, పీలేరు డివిజన్‌కు సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.మదనపల్లిలో 11, రాయచోటిలో 3, పీలేరులో 8 కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు. మొత్తం 639 మంది సిబ్బందిని కేటాయించారు. ఒక్కో కౌంటింగ్ టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక వీడియో గ్రాఫర్‌ను నియమించారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.జిల్లాలో 25 జెడ్పీటీసీ స్థానాలకు గాను 22 స్థానాలకు, 321 ఎంపీటీసీ స్థానాలకు గాను 147 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 1,002 పోలింగ్ కేంద్రాల్లో 8,28,651 మంది ఓటర్లు ఉండగా, 91 మంది జెడ్పీటీసీ, 386 మంది ఎంపీటీసీ అభ్యర్థులు పోటీపడ్డారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని, నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నేత పొనగంటి భాస్కర్



తిరుపతి మన జనప్రగతి నవంబర్ 06:- తిరుపతి మేయర్ గా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన జేబీ శ్రీనివాసులు శుక్రవారం ఆయన కార్యాలయంలో బిజెపి సీనియర్ నేత పొనగంటి భాస్కర్ మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ జెపి శ్రీనివాసులు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సమాజ సంఘటన సేవలో వందేళ్లు అనే పుస్తకాన్ని మేయర్ కు బహుకరించారు. తిరుపతి నగర సమగ్ర అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జేవి శ్రీనివాస్ నాయకత్వంలో నగరం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పొనగంటి భాస్కర్ ఆకాంక్షించారు.

ఎన్వి ప్రసాద్ ఆశీస్సులు స్వీకరించిన కార్పొరేటర్ నాగభూషణం దంపతులు



తిరుపతి, మన జనప్రగతి నవంబర్ 06:-
16వ డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నికైన ఆర్ నాగభూషణం, టిడిపి తిరుపతి పార్లమెంటు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామదాసు మని రామయ్య దంపతులు శుక్రవారం ప్రముఖ సీనియర్ నిర్మాత, టిడిపి నాయకులు ఎన్ వి ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులను కార్పొరేటర్ నాగభూషణం దంపతులు స్వీకరించారు. ఎన్ వి ప్రసాద్ మని రామయ్య దంపతులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవలో తరించాలని, డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆయన ఆకాంక్షించారు.

అక్షరంతో అధికారులను కదిలించి.. 250 మంది విద్యార్థులకు భద్రత



ఉప్పల్, మన జనప్రగతి డిసెంబర్ 06: నాచారం పాత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద గత 20 ఏళ్లుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు పరిష్కారం లభించింది. సుమారు 250 మంది విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన ఈ సమస్యను సీనియర్ జర్నలిస్టు సురేష్ ఇడపాక తన ప్రత్యేక కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శబ్దాలు, మెరుపులు, మంటలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.కథనాలపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ పి. వెంకన్న చొరవతో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పాఠశాల ఆవరణ నుంచి మరో సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో 250 మంది విద్యార్థులకు ప్రమాదం తప్పింది.ఈ సందర్భంగా సీఈ పి.వి. రమేష్, ఎస్ఈ పి. వెంకన్న మాట్లాడుతూ ప్రజా సమస్యను గుర్తించి విద్యార్థుల భద్రత కోసం కృషి చేసిన సురేష్ ఇడపాక సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సమాజ హితం కోసం ఇలాంటి జర్నలిజం కొనసాగించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాతో సురేష్ ఇడపాకను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ కె. సుబ్బారావు, ఏడీఈ కె. శ్రీనివాస్, ఏఈ బి. నాగరాజు, విద్యుత్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 10న 'చలో కలెక్టరేట్' ధర్నా

- ప్రజలు, కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: సీపీఐ



జవహర్ నగర్ మన జనప్రగతి డిసెంబర్ 06: ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' ధర్నాను ప్రజలు, కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమ్మల నరసింహులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, రైతులకు జరుగుతున్న అన్యాయాలను నిలిపివేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులకు, ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం తగదని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఏఐటీయూసీ నాయకులు, మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, పి. కిరణ్ కుమార్, ఆదర్శనగర్ శాఖ కార్యదర్శి డి. నాగేష్, గిరిప్రసాద్ నగర్ శాఖ సహాయ కార్యదర్శి కె. కురుమయ్య, సిహెచ్. ఎల్లయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు కె. జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షరంతో అధికారులను కదిలించి.. 250 మంది విద్యార్థులకు భద్రత



ఉప్పల్, మన జనప్రగతి డిసెంబర్ 06: నాచారం పాత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద 20 ఏళ్లుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు పరిష్కారం లభించింది. సుమారు 250 మంది విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన ఈ సమస్యను సీనియర్ జర్నలిస్టు సురేష్ ఇడపాక ప్రత్యేక కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన నెలకొంది.కథనాలపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ పి. వెంకన్న చొరవతో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పాఠశాల ఆవరణ నుంచి మరో సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో సుమారు 250 మంది విద్యార్థులకు ప్రమాదం తప్పింది.ఈ సందర్భంగా సీఈ పి.వి. రమేష్, ఎస్ఈ పి. వెంకన్న మాట్లాడుతూ విద్యార్థుల భద్రత కోసం సురేష్ ఇడపాక చేసిన కృషి అభినందనీయమని ప్రశంసించారు. సమాజ హితం కోసం బాధ్యతాయుతమైన జర్నలిజం కొనసాగించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సురేష్ ఇడపాకను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ కె. సుబ్బారావు, ఏడీఈ కె. శ్రీనివాస్, ఏఈ బి. నాగరాజు, విద్యుత్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సారు నా బాధ ఆలకించండి.

-పెన్షన్ దారుడు ఆవేదన

తొర్రూరు ప్రతినిధి,మన జనప్రగతి డిసెంబర్ 06: మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని పటేల్ గూడెం గ్రామానికి చెందిన నాళ్ళ ఉప్పలయ్య తండ్రి పేరు మల్లయ్య అనే వ్యక్తి తన పెన్షన్ బుక్ ను నాంచారిమడూరు నుండి తొర్రూర్ కు వస్తున్న క్రమంలో ఆటోలో మర్చిపోవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతినెల పెన్షన్ తీసుకున్న అనంతరం నాంచారి మడూరు పోస్ట్ ఆఫీస్ లో ప్రతినెల 500 రూపాయలు రికరింగ్ డిపాజిట్ గా జమ చేసుకుంటున్నారని బాధితులు తెలిపారు.తన జీవనాధారం పెన్షన్ పైనే ఆధారపడుతూ జీవిస్తున్నానని అందులో కొంత డబ్బులను పోస్ట్ ఆఫీస్ లో జమ చేసుకోవడం జరుగుతుందని పాస్ బుక్ కోల్పోవడంతో ఏమి చేయాలో అర్థం కాక తొర్రూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్కు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ నెంబర్ 020096788650 గల కొత్త బుక్కును ఇప్పించగలరని తమరిని కోరుతున్నానని అన్నారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా కొత్త బుక్ పొందుతేనే తిరిగి మళ్ళీ తను పెన్షన్ తీసుకోవడం జరుగుతుందని అలాగే జమ చేసుకున్న డబ్బులు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని ఆవేదనతో పేర్కొన్నారు. ఇట్టి పాస్ బుక్ ను సబ్ ఇన్స్పెక్టర్ గా మీరు అందించే ఏర్పాటు చేయగలరని కోరుతున్నానని బాధితుడు తన ఆవేదనను వెళ్ళబుచ్చారు.

వరద బాధిత కుటుంబాలకు అండగా..!

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు, రూ.5 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేత.. ప్రభుత్వానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్









సత్తుపల్లి, మన జనప్రగతి డిసెంబర్ 06: సత్తుపల్లి పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఆకస్మిక వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పలు కుటుంబాలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అండగా నిలిచారు.వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు దిండు దుప్పట్లు, పరుపులు అందజేశారు. అంతేకాకుండా ప్రతి కుటుంబానికి రూ.5 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించి బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఆకస్మిక వరదలతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. ప్రతి బాధిత కుటుంబానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేసీఆర్ కాలనీ పక్కనే ఉన్న లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వరదల కారణంగా సుమారు 70కి పైగా లారీల ఇంజిన్లు దెబ్బతిని తీవ్ర ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. లారీ యజమానులు కూడా భారీగా నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లారీ యజమానులకు కూడా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వరదలతో నష్టపోయిన పేద కుటుంబాలు, లారీ యజమానులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి న్యాయం చేయాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, షేక్ రఫీ వీరపనేని బాబి రాధిక, బెల్లంకొండ రాము, భాష, నరుకుల శ్రీను, అమరవారపు కృష్ణారావు, చాంద్ పాషా, అద్దంకి అనిల్, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, గుండ్ర రఘు, గాదె సురేష్, మేకల నరసింహారావు, నడ్డి ఆనందరావు, జొన్నలగడ్డ విజయ్, గంజి వెంకటేశ్వరరావు, అక్షింతలు చంటి, మరికంటి శీను, తడికిమల్లా ప్రకాష్ రావు, రామిశెట్టి కృష్ణ, క్లబ్ వెంకటేశ్వరరావు, మిద్దె శ్రీను, షేక్ బాబు, తదితరులు ఉన్నారు.

వరద ముప్పు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- 2బీహెచ్‌కే ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్





కల్లూరు, మన జనప్రగతి డిసెంబర్ 06: వరద ప్రభావిత ప్రాంతాల్లో భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా 2బీహెచ్‌కే గృహాల నిర్మాణ ప్రాంతాలను సందర్శించిన సబ్ కలెక్టర్, వరదల వల్ల ప్రభావితమైన లబ్ధిదారుల కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో ఎదురైన ఇబ్బందులు, ఇళ్లకు, నివాస ప్రాంతాలకు కలిగిన నష్టాలపై ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై బాధితుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో వరద నీటి ప్రవాహం, నీటి నిల్వలు, ముంపునకు గల కారణాలు, డ్రైనేజీ వ్యవస్థ, నీటి మళ్లింపు మార్గాలను పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అవసరమైన ప్రణాళికలు రూపొందించి, పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదేశించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్లుగా ఖమ్మం బాలికలు





ఆరు మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ ఇవ్వకుండా అజేయ విజయం

ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి డిసెంబర్ 06: ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఖమ్మం జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటారు. అస్మిత రాష్ట్రస్థాయి అండర్15 రగ్బీ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని జిల్లాకు గర్వకారణంగా నిలిచారని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్ కుమార్ రెడ్డి అన్నారు.నవంబర్ 3 నుంచి 5 వరకు సంగారెడ్డి జిల్లాలోని వాక్సెన్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఖమ్మం అండర్15 బాలికల జట్టు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. నిజామాబాద్‌పై 300, యాదాద్రి భువనగిరిపై 150, జగిత్యాలపై 350, మేడ్చల్‌పై 200, మెదక్‌పై 200 పాయింట్లతో గెలిచింది. ఫైనల్‌లో నల్గొండ జట్టును 150తో ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. మొత్తం 135 పాయింట్లు సాధించి ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకపోవడం విశేషం. అండర్18 విభాగంలోనూ ఖమ్మం బాలికలు తృతీయ స్థానం సాధించారు. శుక్రవారం ఖమ్మం చేరుకున్న క్రీడాకారిణులు సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల అధికారి సునీల్ కుమార్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల క్రమశిక్షణ, సాధన, జట్టు సమన్వయం, ఆత్మవిశ్వాసం ఈ విజయానికి కారణమని అభినందిం చారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. **కోచ్ రఘు ప్రత్యేక కృషి**ఈ విజయాల వెనుక ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ బి. రఘు కృషి కీలకమని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చదువుతున్న పేద బాలికలకు సొంత ఖర్చులతో ఉచిత శిక్షణ అందించడంతో పాటు భోజనం, వసతి, క్రీడా దుస్తులు సమకూర్చుతున్నారు. 2025లోనూ ఖమ్మం జిల్లాకు చెందిన అండర్15, అండర్18 విభాగాల 12 మంది బాలికలు సౌత్‌జోన్ పోటీల్లో ఐదు రాష్ట్రాల జట్లతో తలపడి ద్వితీయ స్థానం సాధించారు. బాలికలకు మెరుగైన క్రీడా పరికరాలు, పోషకాహారం, ప్రయాణ, వసతి సదుపాయాలు కల్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. ఖమ్మం బాలికల విజయం పేద విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తోందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారాచూట్ లీడర్‌ను కాదు.. నిరుద్యోగుల కన్నీళ్లు తెలిసిన వాడిని!

13 ఏళ్లుగా నిరుద్యోగుల మధ్యే నా ప్రయాణం..

ఎన్నికలప్పుడే సమస్యలు గుర్తుకొచ్చే వారికి పట్టభద్రులే బుద్ధి చెబుతారు!

కోట్ల లాభాల టర్నోవర్లు వాళ్లు చూస్తే.. నాలుగు గోడల మధ్య నిరుద్యోగుల కన్నీటి వ్యథలను చూశా

ప్రత్యర్థులపై మెండేం కిరణ్ కుమార్ నిప్పులు..

పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఘాటు వ్యాఖ్యలు





హన్మకొండ,మన జనప్రగతి డిసెంబర్ 06: స్వలాభం కోసం ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై పట్టభద్రుల ఓట్లు పొందాలని చూసే పారాచూట్ నాయకుడిని తాను కాదని, 13 ఏళ్లుగా నిరుద్యోగ యువత మధ్య ఉంటూ వారి సమస్యలు, ఆవేదనలు, కన్నీళ్లను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తినని నల్గొండ వరంగల్ ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మెండేం కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. కోట్ల రూపాయల లాభాలు, వ్యాపార టర్నోవర్లు సంపాదించే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు నిరుద్యోగుల కుటుంబాల్లోని కన్నీటి వ్యథలు కనిపించవని, ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ ఎన్నో ఆశలు, కలలతో జీవిస్తున్న యువత వేదన తనకు తెలుసని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలు గుర్తుకొచ్చే నాయకులకు ఈసారి పట్టభద్రులే తమ ఓటుతో బుద్ధి చెబుతారని ఘాటుగా వ్యాఖ్యానించారు.హన్మకొండలోని గోకుల్ నగర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం మెండేం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది పట్టభద్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఎన్ఆర్ఐలుగా విదేశాల్లో ఉంటూ కోట్లాది రూపాయల సంపద కూడబెట్టుకుని, ఇప్పుడు ఆ ఆర్థిక బలాన్ని నిరుద్యోగుల ఆశలకు పెట్టుబడిగా వెదజల్లి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. తాను మాత్రం సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, నిరుద్యోగుల కష్టాలను, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను, ఉద్యోగం సాధించాలన్న వారి తపనను దగ్గరగా అర్థం చేసుకున్నానని తెలిపారు. నిరుద్యోగుల బాధలను కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా రైట్ చాయిస్ అకాడమీ ద్వారా వారి ఉద్యోగ కలలను నిజం చేసే దిశగా రేయింబవళ్ళు శ్రమించానని పేర్కొన్నారు. విదేశాల్లో సంపాదించిన కోట్ల రూపాయలతో నిరుద్యోగుల ఆశలను కొనలేరని, వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కార్యాచరణ, నిరంతర ప్రజా సంబంధాలే నాయకత్వానికి అసలైన కొలమానాలని స్పష్టం చేశారు. తన 13 ఏళ్ల ప్రయాణం పదవులు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరగలేదని, నిరుద్యోగుల సమస్యలు, వారి భవిష్యత్తు కోసమే సాగిందని అన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ కుటుంబాల బాధ్యతలు మోస్తున్న యువత మనోవేదనను ప్రత్యక్షంగా చూశానని, నాలుగు గోడల మధ్య వారు పడే కన్నీటి కష్టాలు తనకు తెలుసునని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నిరుద్యోగుల సమస్యలను ప్రస్తావించి, ఆ తర్వాత వారిని విస్మరించే నాయకుల మాటలను పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.పట్టభద్రుల ఎన్నికలు డబ్బు, ఆర్భాటాలు, రాజకీయ పలుకుబడికి వేదిక కాకూడదని, నిరుద్యోగుల భవిష్యత్తు, పట్టభద్రుల హక్కులు, ఉద్యోగ అవకాశాల కోసం నిరంతరం పనిచేసే నాయకత్వాన్ని గుర్తించాలని కిరణ్ కుమార్ కోరారు. ఈ సమ్మేళనంలో పట్టభద్రులతో ఆత్మీయంగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలనే లక్ష్యంతో ప్రత్యేక ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది పట్టభద్రులు స్వచ్ఛందంగా పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమం లో నిరుద్యోగ జేఏసీ నేతలు చెర్రీ ప్రవీణ్, నవీన్ పట్నాయక్, బాలకోటి, మిత్ర, స్మార్ట్ ప్రవీణ్, శింబు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అభిరామ్, చందు, ఖజురో పాల్గొన్నారు.

భూ భారతి రీ సర్వేలో గ్రామ శివారు సరిహద్దుల గుర్తింపు

- **కూనిపూర్, జలాల్‌పూర్ గ్రామాల్లో సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్ ప్రశాంత్ కుమార్**



వర్ని, మన జనప్రగతి డిసెంబర్ 06: నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న భూ భారతి భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా వర్ని మండలంలోని కూనిపూర్, జలాల్‌పూర్ గ్రామాల శివారు సరిహద్దులను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ ప్రశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలించారు.గ్రామాల శివారు సరిహద్దుల గుర్తింపు, సర్వే పురోగతి, ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూముల సరిహద్దుల గుర్తింపులో ఖచ్చితత్వం పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూనిపూర్ గ్రామ సర్పంచ్ బోయిడి లక్ష్మణ్, మండల గిర్దావర్ శ్యామ్, గ్రామ పాలనాధికారి భీమేష్, సర్వేయర్ చంద్రయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం అభివృద్ధే లక్ష్యంగా కరుణాకర్ రెడ్డి ముందడుగు

- **అధ్యక్ష పదవికి పోటీ.. ఒక్క అవకాశం కల్పించాలని సభ్యులకు విజ్ఞప్తి**



గంగాధర మన జనప్రగతి డిసెంబర్ 06: కరీంనగర్ రెడ్డి సంఘం అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న బి. రెడ్డి కరుణాకర్ రెడ్డి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సంఘం సభ్యులను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, సమాజ ఐక్యతే తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు.ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని, సంఘ అభివృద్ధే తన ఆశయమని పేర్కొన్నారు. సంఘంలోని ప్రతి సభ్యుడికి తగిన గౌరవం కల్పించడంతో పాటు, సమాజ సేవను మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో చూపిస్తానని అన్నారు. సభ్యులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సమాజ అభివృద్ధికి ఐక్యతే ప్రధాన బలమని, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు ఒక్క అవకాశం కల్పించి అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని రెడ్డి సంఘం సభ్యులను సవినయంగా అభ్యర్థించారు.

దేవాపూర్ జిపిలో 2 వివో భవనాలకు భూమి పూజ చేసిన సర్పంచ్

-ముఖ్య అతిథులుగా పాల్గొన్న బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రత్నంసుకుమారి.

- ఆత్మ కమిటీ చైర్ పర్సన్ రౌతు సత్తయ్య.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మన జనప్రగతి డిసెంబర్ 06: మంచిర్యాల జిల్లా, కాసిపేట మండలం, దేవాపూర్ గ్రామపంచాయతీలో 2 వివో భవనాలకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ సిడాం రాందాస్ . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రత్నం సుకుమారిమరియు ఆత్మ కమిటీ చైర్ పర్సన్ రౌతు సత్తయ్య హాజరయ్యారు. దేవాపూర్ గ్రామపంచాయతీ లోని 11వవార్డు,12వ వార్డు లో వివో భవనాలకు శుక్రవారం భూమి పూజ చేయడం జరిగింది . ఈ సందర్భంగా రత్నం సుకుమారి ప్రసంగిస్తూ దేవాపూర్ గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ సీడం రామదాసు ఆధ్వర్యంలో రెండు వివో భవనాలకు భూమి పూజ చేయడం జరిగిందని గ్రామస్తులకు ఎవరికి ఇబ్బంది కలగకుండా భవనాలు నిర్మించడం ఎంతో శుభప్రదం అని అన్నారు. మరెన్నో కార్యక్రమాలు దేవాపూర్ లో జరుపుకోవాలని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న గ్రామ సర్పంచ్ చేయడం రామదాసును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పన్నాల మహేష్ , రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ రత్నం ప్రదీప్ . దేవాపూర్ గ్రామ ఉపసర్పంచ్ గుండ అనసూయ వార్డు సభ్యులు మద్దిమడ సర్పంచ్ ఆడే దివ్య జంగు , ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ , ఏపీఎం రాజ్ కుమార్ , సీసీ రాజమల్లు , ఏ ఈ పి ఆర్ జగన్ , పంచాయితీ కార్యదర్శి కవిత , వివో లీడర్స్ ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు పుటుకం సాయి చరణ్



గంగాధర మన జనప్రగతి డిసెంబర్ 06: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రానికి చెందిన పుటుకం సాయి చరణ్ జాతీయస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు బిఆర్ఎస్ నాయకుడు పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్ శుక్రవారం తెలిపారు. మహబూబ్ నగర్ జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించడంతోపాట ప్రతిభ కనబరచడంతో జాతీయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో ఈనెల 10వ తేదీన జరగనున్న జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పుటుకం సాయి చరణ్ ను గంగాధర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, గంగాధర మండల ప్రజలు అభినందించారు. ఇక్కడ క్రీడాకారులు కోచ్ గంట విజయ్, డి శ్రీనువాస్,ఉపేందర్, లవ కుమార్, ప్రణయ్, శ్రీనివాస్, వివేక్, హేమంత్, శ్రీకాంత్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

రామప్ప శిల్పకళ.. నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- **కాకతీయుల నిర్మాణ కౌశలం అద్భుతం: జయేశ్ రంజన్ ఐఫఎస్**



ములుగు (రామప్ప), మన జనప్రగతి డిసెంబర్ 06: రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ కౌశలం నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కాకతీయుల కాలం నాటి ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ఆలయ నిర్మాణ పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ అతిథులను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, ఆలయ నిర్మాణ విశేషాలు, శిల్పకళా వైభవాన్ని వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకలు, డోలరైట్, బసాల్ట్, ఇసుకరాయి వినియోగం, సాండ్‌బాక్స్ సాంకేతికత గురించి జయేశ్ రంజన్ ఆసక్తిగా తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలను పరిశీలిస్తూ వాటి ప్రత్యేకతలపై కలెక్టర్‌తో చర్చించారు.శిల్పి పేరుతో ఆలయం ప్రాచుర్యం పొందడం రామప్ప ప్రత్యేకతని, శిల్పాల్లో చరిత్ర, పురాణాలతో పాటు నాటి వస్త్రధారణ, కళలు, ఆటలు ప్రతిబింబించడం విశేషమని అన్నారు. ఆనాటి జీవన విధానం, కళా వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తున్న ఈ వారసత్వ సంపద అమూల్యమైనదని ప్రశంసించారు. అనంతరం ప్రసాద్ పథకం కింద ఆలయ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, భక్తులు, పర్యాటకులకు కల్పిస్తున్న సదుపాయాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఎస్సై రాజు, డిప్యూటీ రేంజ్ అధికారి మధుబాబు, ఆర్ఐ రమేష్, జీపీఓ సూరయ్య, పర్యాటక పోలీసులు, రెవెన్యూ, పోలీసు, అటవీ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బండి.. కరీంనగర్ మహా పాదయాత్రకు నేనే వస్తా...

- **చట్ పూజ తరువాత కరీంనగర్ వస్తా**
- **కరీంనగర్ శ్రేణుల జోష్ చూడాలని ఉంది**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో నితిన్ నబిన్**
- **రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ**



కరీంనగర్ మన జనప్రగతి డిసెంబర్ 06: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ సర్ విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కరీంనగర్ లో చేపడుతున్న 'మహా పాదయాత్ర'కు తానే స్వయంగా వస్తానని ఈ సందర్భంగా బండి సంజయ్ కు నితిన్ నబీ చెప్పారు.వాస్తవానికి ఈనెల 5న కరీంనగర్ రావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున రాలేకపోయానన్నారు. ఈసారి 'చట్ పూజ' అనంతరం తప్పకుండా కరీంనగర్ వచ్చి మహా పాదయాత్రలో పాల్గొంటానని చెప్పారు. కరీంనగర్ లో కాషాయ శ్రేణుల జోష్ ను చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నితిన్ నబిన్ బండి సంజయ్ తో చర్చించారు.

ప్లాస్టిక్‌కు 'నో' చెప్పండి.. జీవితానికి 'యస్' చెప్పండి

- ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



కడప, మన జనప్రగతి, నవంబర్ 06:- పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ఆధ్వర్యంలో బీఆర్ఐసీఎస్ బ్యానర్ కింద 'ప్లాస్టిక్‌కు నో చెప్పండి.. జీవితానికి యస్ చెప్పండి' అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 400 మిలియన్ టన్నులకు పైగా ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని, అది పూర్తిగా కరిగిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుందని తెలిపారు. ఒక్కసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల భూమి, నదులు, కాలువలు, సముద్రాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య సుభాష్ చంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా జనపనార సంచులు, గాజు లేదా స్టీల్ బాటిళ్లు, కప్పులను వినియోగించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య ఎ. అమృత్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరాకరించడం, క్రమంగా తగ్గించడం, తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగించిన వస్తువులను తిరిగి ఉపయోగించడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కుటుంబాలు, సమాజంలోనూ ప్లాస్టిక్ రహిత జీవనంపై అవగాహన కల్పించాలని కోరారు.అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

ఆప్తురాలి మృతి పట్ల సంతాపం..

- కుటుంబానికి సంఘం నాయకుల భరోసా
- మానవీయతను చాటుతూ ఇలాసాగరపు తులసమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం నాయకులు



ఖమ్మం ప్రతినిధి,మన జనప్రగతి, నవంబర్ 06: ఆప్తులను కోల్పోయిన కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలవడం, వారి దుఃఖాన్ని పంచుకోవడం మానవీయ విలువలకు నిదర్శనమని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం నాయకులు చాటిచెప్పారు. శుక్రవారం కొనిజర్ల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు ఇలాసాగరపు ప్రసాద్ నానమ్మ ఇలాసాగరపు తులసమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి సంఘం నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తులసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆప్యాయతను పంచిన పెద్దలను కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని, ఇలాంటి విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చావలమడుగు నాగేశ్వరరావుతో పాటు సంఘ సభ్యులు, పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొన్నా రు.మృతురాలి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, ఇలాసాగరపు తులసమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. కష్టసమయంలో బాధిత కుటుంబం పక్కన నిలిచి సంఘీభావం తెలిపిన నాయకుల మానవీయ స్పందన పలువురి ప్రశంసలు అందుకుంది.

ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్న నూతన కార్పొరేటర్లు



తిరుపతి మన జనప్రగతి నవంబర్ 06:- ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు పలువురు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను శుక్రవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని వేరువేరుగా కార్పొరేటర్లు శాలువాతో సత్కరించి ఆయన ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎంపికైన కార్పొరేటర్లకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసి వారి మనసు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. మీ డివిజన్ల లో పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని వారికి సూచించారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు అందరినీ ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు అభినందించారు. ఎమ్మెల్యే ని కలిసిన కార్పొరేటర్లలో బట్టే వెంకట కీర్తి రాయల్, అమృత లక్ష్మి, ఆర్ పి శ్రీనివాసులు, నైనారు రమేష్ యాదవ్, ఆనంద్ బాబు యాదవ్ లు ఉన్నారు. వారితోపాటు శ్రీ తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, బిజీ కృష్ణ యాదవ్, రమేష్ యాదవ్, కిరణ్ పలువురు టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు కలిశారు.

మచిలీపట్నం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం, మన జనప్రగతి నవంబర్ 06:- మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.మచిలీపట్నంలోని వేడుక కన్వెన్షన్ హాల్‌లో కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులు, విజయం సాధించిన కార్పొరేటర్లకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గెలుపుతో బాధ్యత మరింత పెరిగిందని, 60 డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.పదవుల పట్ల అహంకారం చూపకుండా అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేయాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం సంతోషకరమన్నారు.కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మేయర్‌గా ఎన్నికైన అబ్దుల్ అబిదా, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, జనసేన నాయకుడు బండి రామకృష్ణ, కూటమి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైవీయూలో ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవ పోటీలు

- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహణ



కడప, మన జనప్రగతి, నవంబర్ 06:- జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగి వేమన విశ్వవిద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో 'న్యాయ సేవలు వాటి ఉపయోగాలు' అనే అంశంపై వ్యాసరచన, 'ప్రాథమిక హక్కులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ప్రొఫెసర్లు జి. హరినాథ్, కె. శ్రీనివాసరావు తెలిపారు.ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 9న కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు బి. సుశీల్ కుమార్, రాజేశ్వరి, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అత్యస్థైర్యంతో కోలుకుంటున్న విద్యార్థిని గోపిక

- త్వరలో పాఠశాలకు వెళ్లి పదో తరగతి పరీక్షలు రాస్తానంటున్న బాలిక
- బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో పరామర్శించిన మంత్రి సవిత



బెంగళూరు,మన జనప్రగతి నవంబర్ 06:- రాప్తాడు దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శుక్రవారం ఆమె ఆసుపత్రికి వెళ్లి గోపికను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.గురువారం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారని మంత్రి వెల్లడించారు. త్వరలో పాఠశాలకు వెళ్లి పదో తరగతి పరీక్షలు రాస్తానని గోపిక ఆత్మస్థైర్యంతో చెబుతోందని పేర్కొన్నారు. తనకు మెరుగైన వైద్యం అందిస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు బాలిక కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వారిపై దాడులు, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాప్తాడు ఘటన నిందితుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందంటూ జగన్‌పై విమర్శలు చేశారు. నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.మంత్రి వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


జాతీయ వేదికపై హైదరాబాద్ యువతి ప్రతిభ

- శృతికి 'మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్2026' కిరీటం



హైదరాబాద్, మన జనప్రగతి, నవంబర్ 06:- జైపూర్‌లో నిర్వహించిన 'దివాలిషియస్ మిసెస్ ఇండియా యూనివర్స్2026' అందాల పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన శృతి జోయ్‌జోడే 'మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్2026' కిరీటాన్ని గెలుచుకున్నారు. తన ప్రతిభ, ఆత్మవిశ్వాసంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని విజేతగా నిలిచారు.వృత్తిరీత్యా కర్ణాటక సంగీత ఉపాధ్యాయురాలైన శృతి, 2025లో సౌత్ ఇండియా ఐకాన్ అవార్డు అందుకోవడంతో పాటు మిసెస్ తెలంగాణ పోటీల్లో మూడో స్థానాన్ని సాధించారు. అనంతరం మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జన్మించి, హైదరాబాద్‌లో స్థిరపడిన తనకు ఈ కిరీటం దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తన విజయాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమ ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తన ప్రయాణం మరింత మందికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.

సకాలంలో పరీక్షలతోనే క్యాన్సర్ నివారణ సాధ్యం: డాక్టర్ దుర్గాప్రసాద్ రావు



హైదరాబాద్, మన జనప్రగతి నవంబర్ 06:- క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మరణాల రేటును తగ్గించవచ్చని సీనియర్ హోమియోపతి వైద్యుడు డాక్టర్ గన్నంరాజు దుర్గాప్రసాద్ రావు తెలిపారు. 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం' (నవంబర్ 7) సందర్భంగా కాచిగూడ, కుత్బిగూడలోని నిత్య హోమియోపతి సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేడియోధార్మికతను ఆవిష్కరించి క్యాన్సర్ చికిత్సకు పునాది వేసిన నోబెల్ గ్రహీత మేరీ క్యూరీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం 2014 నుంచి నవంబర్ 7ను 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం'గా నిర్వహిస్తోందన్నారు.మన దేశంలో ప్రతి ఏటా 15 లక్షలకు పైగా కొత్త కేసులు నమోదవుతున్నాయని, మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు... పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. పొగాకు, మద్యం, అనారోగ్యకర ఆహారం, వ్యాయామం లేకపోవడం మరియు కాలుష్యమే క్యాన్సర్‌కు ప్రధాన కారణాలన్నారు.సకాలంలో 'స్క్రీనింగ్' పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ముందే గుర్తించి ప్రాణాపాయం తప్పించుకోవచ్చని, బస్తీ దవాఖానలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174